# పరివర్తన

శ్రీ పిల్లా సుబ్బారావు శాస్త్రి

రామారావుగారు సామాన్య కుటుంబీకులు. ఆయనకి ముగ్గురు మగపిల్లలు. ఆయన భార్య రంగమ్మ. రంగమ్మ రామారావుగారెంత నెమ్మదిగల మనుషులో అంత గయ్యాలి మనిషి! రామారావుగారి జీతం నూరు రూపాయిలు. ఆ నూరు రూపాయల్లో ముప్పైరూపాయిలు యింటి అద్దికే పోతుంది ...! పోనీ ముప్పైరూపాయిలు పోతేపోయినై! ఇల్లు బాగుందా అంటే అదీ లేదు....! - వర్షంవచ్చిందంటే చాలు యిల్లంతా వరదయి పోతుంది. పోనీ బాగు చేయించమని అందామా అంటే "ఖాళీ చెయ్యండి! మీరు కాకపోతే మరొకరు! !" అంటాడు యింటిగలాయన! ఆ పట్టణంలో 30 రూపాయిల్లో యిల్లు దొరకడమే కష్టం! రామారావుగారెలాగో తికమకపడుతూ సంసారాన్ని యీడ్చుకొస్తున్నారు.

రామారావుగారు ప్రొద్దుట ఆరుగంటలకి కాఫీ నీళ్లు పోసుకు వెళ్లారంటే, తిరిగి రాత్రి పదిగంటలకే యింటికి వస్తారు - ఆ ఘడియకాలం భార్య అదిలేదని, యిది లేదని వేపుకుతింటుంది... ! ఏమయినా గట్టిగా అంటే "పుట్టింటికి వెళ్లిపోతాను!" అని భయపెడుతుంది.

రంగమ్మ తండ్రి కొంచెం ఆస్తిపరుడు. ఆయనకి ఇద్దరే యిద్దరుపిల్లలు. ఒకమగపిల్లాడు, ఒకఆడపిల్ల. (రంగమ్మ) తండ్రి ముసలాడవడంమూలాన తనకున్న ఆస్తిని పిల్లలకి పంచి పెట్టాడు. రంగమ్మ గర్వానికి, మాటాడితే పుట్టింటికి వెళ్తానని జడిపించటానికి ఆస్తే కారణం... !

రోజూ రంగమ్మ దేనికోదానికి కయ్యం పెట్టుకుంటుంది...! పోనీ "పోతే పో" అందామా అంటే తాను ప్రొద్దుటపోతే రాత్రివస్తాడుకదా, పిల్లలగతేంకావాలి? ముఖ్యంగా పాలుత్రాగే చంటిపిల్లాడిగతేం కావాలి? అతను ఇంతవరకూ ఓపిక పట్టడానికి యిదే కారణం.

ఒక రోజు రాత్రి యీామె బాధపడలేక "చచ్చిపోతా"నంటూ పయనమయ్యాడు

"ఇదో ! మీరు చచ్చిపోతానని నన్ను మాత్రం బెదరించకండి...! మీరు చస్తే హాయిగా బ్రతుకుతాను....! ! నాకు ఆస్తి వుంది !!! - కానీ మీకంటే ముందు నేనే పోతున్నాను! పిల్లల్ని చూసుకోండి! " అంటూ తనబట్టలు సర్దుకు ప్రయాణమయింది రంగమ్మ.

భార్యభర్తల తగువులమధ్య నలిగిపోతున్నారు. పసిపిల్లలు....! మాతృహృదయం కంటే యిక్కడ పితృహృదయమే పిల్లల కోసం వెనక్కువచ్చింది!-అవును! ఆబిడ్డలు

నిజంగా రంగమ్మ కడుపునకన్న బిడ్డలయితే అలా అనకేపోవును...! కాని, వారు మొదటి భార్య బిడ్డలు...! ఆమె చచ్చిపోవడంమూలాన్నే యీమెను చేసుకోవాల్సివచ్చింది! ఆనాడు యిలాఅవుతుందనుకోలేదతను! పాపం!

తిరిగి రామారావుగారు భార్య కాళ్ళు పట్టుకోవాల్సి వచ్చింది....! బ్రతిమలాడుతూ తీసుకువచ్చాడు...!

ఒకనాడు భర్తని యాభై రూపాయలడిగింది రంగమ్మ...!

"ఎందుకూ...!" అని అడిగాడు భర్త

"ఎందుకేమిటి...? మన ప్రక్కింటి సీతమ్మ సిల్కుచీరకొనుక్కుంది...! నేను కూడా కొనుక్కోవాలి...!" అంది రంగమ్మ.

"బాగుంది...! 'గోదావరి పారిందని గొడ్డలేరుపారిందట'! అలాగే ప్రక్కింటి మేనేజరుగారి భార్య కొనుక్కుంటే, నువ్వోలాకొనుక్కుంటావే...! - నా దగ్గర యాభై దమ్మిడీలుకూడా లేవు...!" అని కసిరి కొట్టారు రామారావుగారు.

"లేవూ...? అయితే మానాన్న దగ్గరకి పోతున్నాను..! మీరేం చస్తారో చావండి!!" అంటూ తయారయింది.

రామారావుగారు దూరం ఆలోచించారు - "సరే! పోతేపో..!" అంటూ బండి పిలిచికూడా పంపేశారు.

మొదటి పిల్లలు యిద్దరూ జ్ఞానంవచ్చినవారవడంమూలాన అన్నిపనులు హాయిగా చేసుకుంటున్నారు. ఒకపూట అన్నవంట వండితే, రెండోపూట తమ్ముడు వంట వండేవాడు...! - ఇలా కొద్దిరోజుల్లో, చదువుతోపాటు యిదికూడా అలవాటయిపోయింది. అంతా హాయిగా, శాంతంగా వుంటున్నారు.

రంగమ్మ వెళ్ళిన దగ్గర్నుండీ, భర్త రామారావుగారి జీతంకూడా ఎందుకో కొంచెం పెంచారు. - ఇలా ఆరునెల్లు గడిచాయి..!

ఇకరంగమ్మ తన ఆస్థితో హాయిగా వుంటోంది!-రంగమ్మ దగ్గరకి నలుగురూ పోగయ్యారు...! - ఆమె తన ఆస్థితో ఓవ్యాపారం పెట్టాలనుకుంది..! - కొంతమంది బట్టలకొట్టు పెట్టమని, మరికొందరు మరొకటని ఏవేవో చెప్పారు...

చివరికి రంగమ్మ నల్లమందు, సారాయి వ్యాపారం ప్రారంభించింది...! - ఇలా లాభాలమీద లాభాలు పొందుతోంది! దొంగతనం ఎన్నాళ్లుదాగుతుంది? ఒకనాడు దొరికిపోయింది!! వున్న ఆస్థి అంతా వూడ్చుకుపోయింది...! - కొంత అప్పుకూడాచేసి, తన జైలు శిక్ష తప్పించుకోవల్సి వచ్చింది!

ఎవరింటికి వెళ్లినా ఒకరోజు రెండు రోజులు తప్ప బ్రతికినంతకాలం పోషిస్తారా? కొంతమందయితే తిట్టారు...!

తండ్రేమో "ఆస్తిని తగలబెట్టడమే కాకుండా, నన్ను తలెత్తుకోలేకుండా చేశావు...!" అంటూ తిట్టి భర్తనే వేడుకోమని పంపేశాడు.

"మొగుడుండగా నీకేం పోయ్యే కాలమే!" అన్నారు ఆనాటి బంధువులు!

రంగమ్మకి పూర్తిగా బుద్ధివచ్చింది. స్త్రీకి భర్తకంటె వేరే ఆస్తిలేదని గ్రహించింది.

"నన్ను క్షమించండి! ఆస్తివుందని మిమ్మల్నేవేవో అన్నాను..! నాకు పూర్తిగా లోకం అంటే ఏమిటో అర్థమయింది! - స్త్రీకి ఆస్తి భర్తే!" అంటూ రామారావుగారి కాళ్లమీద పడింది రంగమ్మ.

రామారావుగారు భార్యలో కలిగిన మార్పుకి చాల సంతోషించాడు! రంగమ్మ పిల్లల్ని కన్నబిడ్డల్లాగ చూచుకొంటూ హాయిగా కాలంగడిపింది.

